




# పెళ్ళయితే...

## ఆదివిష్ణు





ఉద్యోగరీత్యా ప్రస్తుతం బెజవాడలో వుంటున్నానన్న మాటేగాని మనసంతా బందరువైపే లాగుతుంది. సంవత్సరన్నర క్రితం బందరు వొదిలి యీ వూళ్లో కాలుపెట్టాను,

జననీ జన్మభూమిశ్చ .... అన్నారు కాబట్టి బందరంటే యిప్పటికీ నాకు అమితమైన గౌరవం, భక్తీని. "సొంత వూరుని ప్రేమించలేని మానవుడిని నేను క్షమించలేను" అనేవారు మా యింగ్లీషు లెక్చరరు తెలుగులో. ఆయన పుట్టిందీ పెరిగిందీ. ఉద్యోగంచేస్తోందీ బందర్లోనే మరి.

బందరు పిచ్చాళ్లకి ప్రసిద్ధని గిట్టనివాళ్ల ప్రచారం నేనమ్మను. నమ్మమని మీకూ చెప్పను.

సారీ.... సుబ్బారావుగురించి వ్రాద్దామని కూర్చుని బందరు గురించి రాసేస్తున్నాను. క్షమించాలి. ఈ కథకు కథానాయకుడు సుబ్బారావు ఒక్కడేకాదు– చాలామంది వున్నారు. అయితే. సుబ్బారావు మీది ప్రేమ కొద్దీ యిది వ్రాయాలనుకున్నాను. కాని తీగలాగితే డొంకంతా కదిలినట్టు సుబ్బారావుని పరిశీలించిన యీ మనసులో అతనితోపాటు చాలామంది బొమ్మలు అచ్చు వేయించుకున్నాయి.

బందర్లోపుట్టి బందర్లోనే ఉద్యోగాలు చేస్తున్న మనుషుల్ని చూస్తూ వాళ్ళ అదృష్టాన్ని పదిమందికి చెప్పడం నాకు అలవాటు. అందుచేతనే సుబ్బారావునీ, రాజునీ ఇక్కడ పరిచయంచేసి చలపతి (విశాఖ పట్టణం), కనకారావు (సామర్లకోట), భుజంగం (తుని), కేశవులు (నెల్లూరు) వగైరాలను వొదిలేస్తోంది.

సుబ్బారావు సొంతవూరు బందరుకి పది మైళ్ళ దూరంలోవున్న పల్లెటూరు. అయితే అతను బందర్లోనేవుండి చదువుకున్నాడు. అక్కడే ఒక చిన్న అద్దెగదిలో వుండి ఉద్యోగం చేస్తున్నాడు. నెలకి ఒకటి రెండు మాట్లు ఆ పల్లెటూరు వెళ్ళినా అది పెద్ద లెఖ్ఖలోకి రానేరాదు. కాబట్టి అతను బందరు షౌరుడనే చెప్పవచ్చును.

రెండు : రాజు (అతని మీసాలు మిలట్రీ వాడివిలా దాగుంటాయి. భయంకరంగా వుంటాయి) అతను సాక్షాత్తూ బందర్లోనే పుట్టాడు. ప్రస్తుతం అక్కడే (యింకా ఉద్యోగం లేదు) వుంటున్నాడు. వాళ్ళ యిల్లు బస్సుస్టాండు ప్రాంతంలో వుంది. వాళ్ళు బాగావున్న వాళ్ళు. మీరు గనక అతన్ని కలుసుకోవాలంటే — బందరు బస్సుస్టాండులో దిగి తలెత్తి చూడండి. మీముందు చక్కటి మేడ కనిపిస్తుంది. ఆ మేడపైన మీక్కనిపించేలా పేము కుర్చీలో నవ్వుతూ మీసాలు మెలివేస్తూ కూర్చొనుంటాడు. వయస్సు పాతికేళ్ళ లోపు. ఆరడుగుల మనిషి. ఎత్తుకి తగ్గ లావూను.

ఈ వ్రాసేది నిజం కాదని మీ కనిపిస్తే. నా మాటమీద మీకు నమ్మకం లేకపోతే రాజును కలుసుకోండి. అతను అబద్ధం చెప్పడు. అతని గురించి వ్రాస్తున్నాను కాబట్టి కాస్త ఆలస్యమైనా నిజమే చెప్తాడు. బిస్కట్లపీ పెడతాడుగూడాను. అతను మంచి మిత్రుడు. అతన్ని కలుసుకుంటే మీకు సుబ్బారావుని పరిచయం చేస్తాడు.

ఈ సుబ్బారావూ, రాజూల గురించే నలభైమైళ్ళ దూరంలోవున్న బెజవాడనుంచి నేను వారం వారం బందరు వెడుతూంట. రెండో కారణం బందరనబడే బస్తీమీద వల్ల మాలిన అభిమానమూను.

మా ఆఫీసు శనివారంనాడు ఒంటిగంటన్నరకి అయిపోతుంది. తిన్నగా వొచ్చి అక్కడ బస్టాండులో బస్సెక్కి సాయంత్రానికి బందరు చేరుకుంటాను. ఆవేళకి రాజూ వాళ్ళ మేడమీద సిగరెట్లు కాల్చుకుంటో మావాళ్ళిద్దరూ నాకోసం యెదురు చూస్తుంటారు.

మిగిలిన కొద్ది శనివారమూ, పూర్తి ఆది వారమూ మేం ముగ్గురం మాయిష్ట మొచ్చినట్టు బందరురోడ్లు సర్వే చేసేస్తాం. కనీసం మూడు సినిమాలైనా చూడాలనే నిబంధన ఒకటి వుంది. సినిమాలు చూసేవాళ్ళమేగాని వాటిల్లో అడుగడుగున దర్శనమిచ్చే ఆయొక్క టాలెంటూగట్రా, పట్టించుకునే వాళ్ళంకాదు. మరి అలాంటప్పుడు సినిమాకెందుకయ్యా వెళ్ళడవూ మరీ బడాయి కాపోతే అంటారేమో. అవుతే మీరు పొరపడ్డారన్నమాటే. సినిమా చూడ్డానికి వెళ్ళినా మనసు మాత్రం చూడ్డిచ్చేదికాదు. ఆ వారంలో జరిగిన ముఖ్యమైన విషయాలు సమీక్షించుకునేందుకు ఎంతసేపని పార్కులో గడిపేదీ, మరెంతసేపని రేడియోముందు కూర్చునేదీ. కనక వెరైటీ కోసరమైనా యిలా థియేటర్లకి వెళ్లేవాళ్ళం.

పార్కుల్లోనూ, అద్దెగదుల్లోనూ, సొంత యిళ్ళల్లోనూ తన 'ప్రేమాయణం' చెప్పి - నాగతి ఏమవుతుందో, ముందేమవుతుందో - అని పాడే రాజు సినిమాహాల్లోకొచ్చింతర్వాత గప్‌చిప్ అయిపోయేవాడు. అయితే అయ్యేడు. నన్నూ సుబ్బారావునీ మాటాడనిచ్చేవాడు కాదు. అయినా ఎలాగో వీలు చేసుకుని ఆ ఖబురూ యీ ఖబురూ ఒకళ్ళ చెవి నొకళ్ళు వేసుకుంటూనే వుండేవాళ్ళం. మా మాటలవల్ల ప్రేక్షకు లెవరైనా డిస్టర్బయినట్టు గ్రహించిందే తడవు రాజా బలమైన చెయ్యి నా భుజాన్నో, సుబ్బారావు మెడనో స్పృశించేది. దాంతో మా ఖబుర్లు ఆ నిమిషానికి ఆగేవి. అనక కాస్త సినిమాని సీరియస్‌గా చూచిన తర్వాత మళ్ళీ సాగేవి. రాజా పరామర్శతో మళ్ళీ ఆగేవి.


ఇది నేను బందరు వెళ్లినప్పటల్లా తప్పనిసరిగా జరిగే కార్యక్రమం. ఒక్కోసారి రాజా, సుబ్బారావు బెజవాడొచ్చే వాళ్ళు. ఒచ్చేముందు ఉత్తరం రాసి పారేసే వాళ్ళు. వొచ్చిన తర్వాత ఒక్క నిమిషమైనా మాకు తీరుబడి దొరికేదికాదు. మా హోటల్లో భోంచేసి ఏ లీలామహల్‌నో పావనంచేసి మా అద్దెగదిలో సర్దుకుని నిద్రపోయేవాళ్ళం.

ఆ నిద్ర గట్టిగా ఒక్కగంట పాటు వుండేమో. మిగిలినదంతా ఖబుర్లూ, సిగరెట్లు కాల్చడం, నవ్వులూను. అప్పట్లో మాయెదట ఒకటే సమస్య ఉండేది — రాజా ప్రేమ వర్ధిల్లి, అతను ప్రేమించిన పడతిని పెళ్లాడితే, అంతకన్న వేరే కావలసిందేమిటీ అని.

పాపం .... నిజం చెప్పద్దూ .... రాజు గూడా (ఎంత సరదాగా తిరిగి ఎంత కులాసాగా మాటాడినా) అతని ప్రేమని తలుచుకుని దిగులుపడుతూనే వుండేవాడు. ఈపెళ్లికి వధువు వాళ్ళ యింట్లో వప్పుకున్నారుటగానీ రాజా అమ్మానాన్న మాత్రం వప్పుకోలేదుట. అతను అనేవాడు :

"దైవకృపవల్ల మా పెళ్లి జరుగుతే కొండకెళ్ళేముందు పతీసమేతుడనై నీగది కొస్తాను. ఎందుచేతనో మరి బెజవాడలో చెప్పుకోదగ్గ లాడ్జింగ్స్ అన్నింటి కంటె నీ అద్దెగదే హాయిగా వుంటుంది. ఎంత ఎయిర్‌కండిషన్డ్ రూమైనా సరే దీనిముందు దిగదుడుపు."

అది నాపట్ల అతని కున్న అభిమానాన్ని తెలియజేస్తుందే తప్ప, నిజానికి అతిశయోక్తేగా మరి.




పోతే సుబ్బారావ్ విషయం సరేసరి. బందర్లో అతని రూమ్‌కంటే యీవూళ్ళో నారూమ్‌లోనే స్వేచ్ఛగా వుంటాడు. (దానికి కారణం లేకపోలేదు— అక్కడ అతనికి గది నిచ్చినాయన వాళ్ళ బంధువు:) సుబ్బారావ్‌లో వున్న ఒకేఒక ముఖ్యమైన క్వాలిఫికేషన్ ఏమిటయ్యా అంటే - అతను ఇరవైనాల్గు గంటలూ నవ్వుతాడు, ఎదటివాళ్ళని నవ్విస్తాడు. సెన్సాఫ్ హ్యూమర్ జాస్తీగా వున్న మనిషి. పెద్ద విట్‌మాస్టర్. నాకిలాటి మనుషులంటే చాలా యిష్టం.

ఈ బెజవాడ వొచ్చినతర్వాత నాకు పరిచయమై, బహు కొద్దికాలంలోనే మా అందరికీ ఆత్మీయుడైన వ్యక్తి విశ్వేశ్వర్రావ్. అతను చక్కటి కథలు రాసి పదిమందిలోనూ అవుననిపించుకుంటోన్న సోదర కథకుడు. అతని కింకా పెళ్ళికాలేదు కాబట్టి, అతని గురించి యీ కథలో ఎక్కువగా వ్రాయడం లేదు. అతన్నడిగినా నే రాసినదంతా నిజమనే చెప్తాడు, అతన్ని కలుసుకోవాలంటే ముందు నన్ను కలుసుకోండి. అడ్రస్సదీ యిస్తాను. బైదిబై - అతనీ మధ్య పెళ్ళిచూపుల్లో చూపు నిలిపినట్టు వార్త. కాబట్టి మనం కనపడమేమో.

'ఇదంతా సోది. కథ ఒక్క అడుగు కూడా కదల్లేదు. వొళ్ళు దగ్గరెట్టుకుని వ్రాయి. ఇంకా యిలాగే సొడుగిస్తే నీ ముక్కు చితగ్గొట్టేస్తాం అయ్(....'

ఇక చదవండి....

పోయినేడాది మే నెల వరకూ అటు బందరులోనూ, అప్పుడప్పుడూ బెజవాడ లోనూ మా స్నేహితులమధ్య సరదాలకీ, సంతోషాలకీ ఏ అంతరాయమూ రాలేదు.

ఆ మే నెలలోనే మా సుబ్బారావ్ పెళ్ళయింది!

సుబ్బారావ్ పెళ్ళిమాట వినగానే మేమందరం చాలా సంతోషించేం. ఎక్కడెక్కడున్నంచో పాతమిత్రులందరూ వొస్తారుగదా రెండు రోజులపాటు ఆనందంగా గడపవచ్చుగదా అని ఎంతో మురిసిపోయాం.

అనుకున్నట్టుగానే సుబ్బారావ్ పెళ్ళికి చాలామంది స్నేహితులు వొచ్చేరు. వచ్చిన వాళ్ళలో పెళ్ళయినవాళ్లూ, కానివాళ్ళూ, అవబోయేవాళ్ళూ, తండ్రులూ యిలా చాలా రకాలు వున్నారు. ఒకప్రక్క మా సుబ్బారావ్ పెళ్ళి జరుగుతుండగా మరో పక్క పరామర్శలూ, కుశలప్రశ్నవర్షాలూ, పాతగాధల బాధలూ, కొత్తజీవిత సుఖాలూ చర్చించబడుతున్నాయి.

విడిదింట్లో చీట్లాట ప్రారంభమైంది.
ఇక్కడే తుఫాన్ విజృభించింది.
అప్పుడే పెళ్ళయిన శాల్తీలమీద భవదీయుడికి నమ్మకం పోయింది.
అదే యీ కథకి నాంది అయింది.

—చీట్లాటలో చలపతిని చెప్పుకుని మరొకళ్ళని చెప్పుకోవాలి. దేశం ఏమూల ఏ రకమైన ఆటని ఎలా ఆడతారో వాడు చెప్పగా విని తీరాలి. వాడికి చీట్లాటలో అన్ని రకాలూ తెలుసు. సరైన శిక్షణా యివ్వగల నేర్పరి.

అలాంటి చలపతిని మేము గౌరవించడంలో తప్పులేదుగా. అదేమి పాపమో గాని వాడు సరిగ్గా ఒక్కగంటైనా మూతో పేకముక్క ఎత్తలేక పోయాడు. ప్రతి పదినిమిషాలకీ వాళ్ళావిడ దగ్గర్నుంచి పిలుపొచ్చేది. పాపాయి ఏడుస్తుందనో, బట్టలపెట్టి ఎక్కడపెట్టారో చెప్పమనో, చిల్లరడబ్బులేవైనా వుంటే యిచ్చిపోరాదా అనో. చీట్లాట అంటే పంచప్రాణాలూ ధారపోసే మా చలపతికి యీ 'పిలుపులు' విసుగు తెప్పించలేదు సరిగదా ఖబురొచ్చిన ప్రతిమాటూ ఏదో నేరంచేసిన దుర్మార్గుడిలా మొహంపెట్టేసి నిట్టూర్చి తనని తను తిట్టుకుని తన చేతుల్లోని పేకముక్కలు చాపమీద పగటికలలు కంటూ పగటినిద్రపొయ్యే విశ్వేశ్వర్రావ్ మొహంమీద గిరాటువేసి పరుగెత్తేశాడు. విసుక్కునే వంతు విశ్వేశ్వర్రావ్‌ది అయ్యేది.

—పద్నాలుగోమాటు చలపతి పిలుపు అందుకుని లేవబోతుండగా గట్టిగా అరిచాను.

"ఆగు".

చలపతి ఆగిపోయాడు. మిగతా మిత్రులు కళ్లప్పగించి చూస్తుండిపోయారు. చీమ చిటుక్కుమన్నా శబ్దమయ్యే అనిశ్శబ్దం రెండు క్షణాలు ఆవరించిన తర్వాత నోరు సందాళించుకుని అన్నాను.

"నీకు చీట్లాట కావాలో మీ ఆవిడ కావాలో యిప్పుడే యిక్కడే తేల్చిచెప్పు. అంతేగాని లేవడం మళ్ళావచ్చి కూర్చోడం బిజినెస్ యింక సహించం".

దాంతో చలపతి బుర్ర తిరిగి వుంటుంది. తాగినవాడిలా శివాలెత్తినట్టు అన్నాడు.

"నిలబెట్టి యిలా అడుగుతావని తెలుస్తే నా సమాధానమేదో ముందే చెప్పి వుండే వాడిని. నీలా తాడూ బొంగరం లేనివాడిని కాదు. నా నెత్తిమీద బాధ్యతలు చాలా వున్నాయి బ్రదర్! మరొకళ్ళ అవసరాలు చూడవలసిన కర్తవ్యం నాకుంది. నీతో యీ వెధవాట ఆడటానికొచ్చాడు సుబ్బారావ్ పెళ్లికి వస్తే. పోనీలే....సరైన చెయ్యిలేక ఏడ్చిపోతున్నారని మీ దగ్గర కూర్చుని మీతో చెయ్యి కలిపినందుకు మంచిమాటే అంటించావ్. నీకూ, నీ ఆటకీ ఓ నమస్కారం. వొస్తాను." అనేసి గబగబా వెళ్ళిపోయాడు చలపతి.

చలపతి! ఆఫ్టరాల్ చలపతా,నన్నింతలేసి మాటలనేస్తా? వాడిది గుండెకాయా? నల్లచెరువా? ఎన్నికూతలు కూశాడూ? ఎంత అవమానించాడూ? ఔరా చలపతీ! నీ పెళ్ళయింతర్వాత గదట్రా నువ్వింత మారిపోతా?

చలపతి ఉపన్యాసం విన్న మీదట పెళ్ళయిన మరో రెండు శాల్తీలు సిగ్గుతో చచ్చిపోయి లేచి చక్కావెళ్ళిపోయాయి.

ఆ రాత్రి మిత్రవర్గం అత్యవసర సమావేశం ఏర్పాటు చేసింది. నే నన్నదాంట్లో తప్పులేదని బ్రహ్మచారులూ, చాలా దారుణంగా మాటాడితినని పెళ్ళయిన బ్రదర్సూ వాదించుకోడం మొదలెట్టారు. ఈ యుద్ధం చూచే ఓపికలేక విశ్వేశ్వర్రావ్, రాజూలతో సినిమాకి పారిపోయాను.

ఆ మర్నాడు తెలిసిందేవిటంటే చలపతిగాడి భార్యామణికూడా నాకో చురక అంటించిందిట.

"అతనికేవిటీ, ఎన్నైనా అంటాడు మరి. ఇల్లా, ఇల్లాలా, పిల్లలా, బాదరబందీనా. ఏమీ లేవుగాబట్టి యిష్టమొచ్చినట్టు అనగలరు. అయినా యీయనగారికి వుండాల్లెస్తూ - ఎక్కడలేని స్నేహితులూ మనకే గావాలాయె మరి."

భోరున ఏడ్చేయాలనుకున్నాను గానీ పక్కనున్న రాజూ సముదాయించడంతో వూరుకున్నాను.

ఆ సాయంత్రం అందరూ ప్రయాణమయ్యారు. నేను హోల్డాలు సర్దుకుంటూండగా చలపతి వొచ్చేడు బిక్కుబిక్కు మంటూ. గదిలో ఇద్దరమే వున్నాము. వొచ్చినవాడు చుట్టూతా చూచి నెమ్మదిగా గొణిగాడు.

"క్షమించు. తొందరలోఏదో అనేశాను."

నవ్వాలనిపించింది. నవ్వేశాను. ఆపైన వాడిభుజం తట్టి "మనం స్నేహితులమోయ్" అన్నాను.

ఇదంతా మా సుబ్బారావుకి తెలీదనా? బాగా తెలుసు. ఆరోజున జరిగిన యీ గందరగోళం తాలూకు వివరాలన్నీ యీనాటికీ వాడికి గుర్తే. లేదన్నాడో - కోస్తున్నాడన్న మాటే మరి.

చలపతి మారినందుకు విచారించి వూరుకున్నాను. సుబ్బారావూ మారిపోతాడని నేనెప్పుడు అనుకోలేదు. మే నెలలో అతని పెళ్ళయింది. జూన్ నెలంతా మామూలుగానే వున్నాడు. రోజు విడిచి రోజు ఉత్తరాలూ, వారం వారం మా సమావేశాలూ అన్నీ సక్రమంగానే జరుగుతున్నాయి.

జూలై నెలలో ఒక శనివారం దారుణమైన రోజుగా నిలిచింది.

---

● దగ్గిర వస్తువులు సరిగా కనిపించక బాధపడే ఒక మిణుగురు పురుగు ఎవరో పారేసిన సిగరెట్టు పీకని పెళ్ళిచేసుకున్న సంగతి మీకు తెలుసా?

సరీగ్గా అప్పట్నుంచే యీ పెళ్ళయిన వాళ్ళమీద కసి చక్రవడ్డీలా పెరిగిపోతున్న దీని. ఆ శనివారం మామూలుగా బంద రెళ్ళాను. రాజూవాళ్ళ మేడమీద మావాళ్లిద్దరూ లేరు. బిక్కు_బిక్కు_మంటూ మేడ మెట్లెక్కాను. రాజూ వాళ్ళమ్మగారు కనుపించేరు. ఆవిడ చెప్పారు_ రాజు తన ప్రేమ విషయ మేమిటో తేల్చుకోడానికి నిర్ణయించినవాడై, ఆరోజుయింట్లో పోట్లాడి, తిన్నగా 'వాళ్ళ' యింటికి వెళ్లాట్ట.

"పోనీండి పిన్నిగారూ_ అతని కోరికని కాదనకండి. మీకు మాత్రం అతని సుఖమే కదా కావలసింది." అని ఆవిడకి నచ్చచెప్పి, తిన్నగా సుబ్బారావ్ గదికివెళ్లాను. అతనిగురించి అడిగేను. ఆయింటాయన నవ్వుతూ

"వాడు అత్తారింటికి వెళ్ళాడోయ్"

అన్నారు.

ఆరిపిడుగా — వెడుతున్నట్టు ఉత్తర మైనా వ్రాశావుకాదే. ఎంత బందరైనా, ఎంత సొంతవూరైనా ప్రాణంపెట్టే మిత్రులిద్దరూ యిలా పరాయైపోతే 'బోరు' కొట్టదుటండీ. అందుచేతనే ఎప్పుడూ లేనిది ఆదివారంఅర్థరాత్రి రైలెక్కి_బెజవాడ వెళ్లాను.

నెలలు దొర్లాయి.

రాజూ, సుబ్బారావూ యిద్దరూ ఉత్తరాలు వ్రాయడం మానుకున్నారు. బందరు వెళ్ళినా కనిపించేవారు కానేకాదు. రెండు మూడు సార్లు ఓపికతెచ్చుకుని వెళ్ళేనేగాని తర్వాత విసుగుపుట్టి మానుకున్నాను.

ఒక రోజున....

రాజూ పెళ్ళి అతని ప్రియురాలితో జరుగుతున్నట్టూ, ఆపెళ్ళికి రెండువైపులా పెద్దవాళ్ళ-వప్పుకున్నట్టూ శుభలేఖా, ఉత్తరమూ వచ్చేయి. ఆనందించాను. కానీ.... ఒక శంక పీడిస్తోనే వుంది. పెళ్ళయిన తర్వాత రాజుగూడా చలపతీ, సుబ్బారావుల్లా మారిపోతాడేమో? ఏమో....

నాలుగు రోజులు సెలవు తీసుకొని బందరు వెళ్ళేను. ముందస్తుగా సుబ్బారావు అద్దెగదికి వెళ్ళి అతనికోసం అడుగుతే ఆ యింటాయన ఫొళ్ళున నవ్వేసి,

"నీకింకా తెలీదుటోయ్. అతను కాపురం పెట్టాడు. ఇంగ్లీషుపాలెంలో యిల్లూ తీసుకున్నాడు." అన్నారు.

నే వాచ్చేస్తూండగా - ఆయన మళ్ళా నవ్వి మెల్లిగా అన్నారు.

"నువ్వూ ఓ యింటివాడివి కాకూడదటోయ్-"

— సుబ్బారావు సంసారి అయ్యాడు.

ఈ విషయమై ఉత్తరం రాస్తే నేమాత్రం సంతోషించనూ. అతను నన్నెందు కింత నిర్లక్ష్యం చేస్తున్నాడు? హుఁ....ఎవర్నని ఏం లాభంలే....

రాజూ పెళ్ళిలో సుబ్బారావు కనిపించాడు గాని, అతన్ని చూస్తూంటే అలనాటి చలపతే నయమనిపించేడు. దుఃఖాన్ని కడుపులో పెట్టుకుని వాళ్ళందరి ముందూ తిరిగాను.

రాజు పెళ్ళి నిర్విఘ్నంగా జరిగింది.


ఆఫీసు కొచ్చేశాను. అన్నీ మరచి పోయ్యేందుకు సర్వ ప్రయత్నాలూ చేస్తున్నాను.

● ● ●

మీ రనుకునే చక్కటి ముగింపు వ్రాయడాని కిది కథకాదుగా. కాబట్టి జరిగింది జరిగినట్టు వ్రాయడం నా విధి.








రాజూ, వాళ్ళ శ్రీమతితోపాటు వొస్తున్నట్టు వైరిచ్చాడు. అతను నన్నింకా మరిచిపోనందుకు చాలా సంతోషించాను. అతను లోగడ అన్న మాటా గుర్తుకొచ్చింది. అతని పెళ్ళి కోరుకున్నవాళ్ళతో అయింది కాబట్టి ఒకరోజు నా గది వాళ్ళకి విడిది అవుతుందన్నమాట. జీవితంలో, దంపతులన్నవారికి ఆతిథ్యమివ్వడం యిది మొదటి సారి. కాబట్టి ఏ కోపమూ రాకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకోవడంలో మునిగిపోయేను.

వాళ్లు వొచ్చేరు. సాదరంగా ఆహ్వానించేను. ఆ తర్వాత రాలిన చిత్రాతి చిత్రమైన అతని మాటల తాలూకు కొన్ని ముత్యాలు.

"దుర్గాభవన్‌లో ఎయిర్ కండిషన్డ్ రూము లుంటాయిగదూ....".

వాళ్ళ తీసుకున్న ఎయిర్ కండిషన్డ్ గదిలో కాఫీ తాగుతూ అన్నమాటిది....

"అవునూ ...విశాఖపట్టణం వెళ్ళేందుకు ట్రెయిన్ టైమింగ్సేమిటో చెప్పగలవూ."

కళ్ళనిండా నీళ్ళు నింపుకుని తెలిసినంత వరకూ చెప్పాను.

"ఆల్‌రైట్. అవుతే రేపుదయం మెయిల్ మీద వెళ్లడమే హాయి. విశాఖలో మా బ్రదర్లా ఒకాయన కెజిహెచ్‌లో వున్నాడు."

వాళ్ళావిడ పక్క_నుంది కాబట్టి రాజు బ్రతికిపోయాడు. లేకపోతే అతని చెంప, ఛెళ్ళు మనిపించేవాడిని. పైగా - భయం కలి

గించే అతని 'మిలిట్రీ మీసాలు' యిప్పుడు లేవుగూడాను.

ఖాళీగావున్న నా కుడిచేతి గుప్పిటని మూస్తూ, కోపాన్ని దిగమింగుతూ, ఆ దంపతుల ఖబుర్లలో ఔచిత్యం లేకుండా కూర్చున్నాను. తిరిగి తొమ్మిది గంటలకి నా అద్దె గదిని చేరుకున్నాను.

మరునాడుదయమే వాళ్ళు విశాఖపట్టణం వెళ్ళివుంటారు!

ఇది జరిగిన రెండోనాడు సుబ్బారావు దగ్గర్నుంచి ఉత్తరం వొచ్చింది. ఆత్రంగా చదివాను. ఆకర్షించిన వాక్యాలు యివి:

"బందర్లో బోరుకొడుతోంది. నువ్వొక్కసారి వొస్తే ఎంత బావుంటుందని. పైగా— నువ్వు నేనూ మనందరం మిస్సయిన సోఫియా లారెన్ పిక్చరొకటి విజయలక్ష్మిలో ఆడుతోంది. బందరులో యీ మధ్య సివిలిజేషన్ పెరిగిపోతోందయ్యోయ్. వొస్తావుగా."

సుబ్బారావు బొత్తిగా పూర్వకాలపు మనిషైనందుకు సంతోషించాను. అతన్ని యిన్నాళ్లు అపార్థం చేసుకున్నందుకు చింతించాను.

శనివారం బందరు వెళ్లాను. సుబ్బారావింటి దగ్గర రిక్షా దిగాను. నాకోసమే యెదురు చూస్తున్నట్టు అతను వరండాలో కాలుకాలిన పిల్లిలా తిరుగుతున్నాడు. నన్ను చూడగానే 'హల్లో' అన్నాడు. ఆపైనఇంటికి తాళంవేసి నాతోపాటు రోడ్డు ఎక్కాడు. దార్లో అన్నాడు —

"త్వరలో నేను తండ్రిని కాబోతున్నానోయ్."

— దొరికింది. క్లూ దొరికింది. వాళ్లావిడ పుట్టింటికి వెళ్ళిందికాబట్టి సుబ్బారావు నాకు ఉత్తరం రాశాడుగానీ - లేకపోతే - నన్నుగానీ, సోఫియాలారెన్ పిక్చర్నిగానీ, విజయలక్ష్మి థియేటర్నిగానీ లెఖ్ఖచేయునా మా సుబ్బారావు? సుబ్రావ్! పోనిచ్చావ్ కాదోయ్ నీ పెళ్ళయిన పెద్దమనిషి బుద్ధి.

సినిమా అయింతర్వాత మా యింటికెళ్ళాను. నిద్రపోయేముందు అక్కయ్య కూతురు గుర్తుకొచ్చింది. ఇంకా మా పెళ్లికి వాయిదా వేయడం భావ్యంకాదు. నిజానికి ఆ పిల్లేకదా నాకుదూరంకానినేస్తం: ▢▢▢

---


● ఒక ముంగిస ఒక పెద్ద హోటల్లోకి వెళ్ళి కాఫీ ఆర్డరిచ్చింది. తాగిన తరవాత కౌంటర్ దగ్గిరికి వెళ్ళి పదమూడు నయాపైసలు బల్లమీద పెట్టింది.

"కాఫీ ఇరవై పైసలండి" అన్నాడు హోటలతను.

ముంగిస జేబులోంచి ఇంకో ఏడు నయాపైసలు తీసి ఇచ్చింది. హోటలతను "థాంక్స్" అని నవ్వుతూ "మా హోటలుకి ముంగిస రావడం ఇదే మొదటిసారి" అన్నాడు.

"మీరిచ్చే కాఫీ ఇరవై పైసలైతే ఇదే ఆఖరిసారికూడాను." అంది ముంగిస.





# వాన కురిసిన రోజు

టి. ఎస్. లక్ష్మి

ప్రొద్దుట్ని నాలుగు గంటలైంది. టిఫిన్ కాఫీలపని పూర్తిచేసి, వంటగది బయట కొచ్చింది రాధ బి. ఎ.

"నాకు కంచిపట్టు పరికిణీ కావాలి.... ఈ ...ఈ...." ఈ తో దీర్ఘాలాపన చేస్తోంది ఐదు సంవత్సరాల సుజాత.

"అమ్మా: చింతపండు ..... అమ్మగోరూ, చింతపండు" పనిదాని కేకలు. మైలుదూరంనించి పిలుస్తున్నట్టు.

"అమ్మా: బట్టలు లెక్కజూసుకోండమ్మా... ఐల్డిపోవాల" చాకలిదాని ఉదర.

"ఢాం ఢాం.... ఢాం" పౌడరు డబ్బాని నేలకేసి కొడుతూ, కిందపడ్డ పౌడరుని వళ్ళంతా పూసుకుంటున్న రెండున్నర సంవత్సరాల శీను.

రాధ గట్టిగా చెవులుమూసుకుని, గదిలోకెళ్ళి తలుపు గడియపెట్టింది. గాలిలో తేలి మోతలు, అరుపులు, ఏడుపులూ గదిలో ప్రతిధ్వనిస్తున్నాయి. అలిసిన శరీరం మన